**కథ**

**“సౌయంత్రానికల్లా వచ్చేస్తావుగా... అహఁ ఏం లేదూ... ఇన్ఫర్మేషన్ కోసం. అంతే” నన్ను సిటీబస్ ఎక్కిస్తూ అడిగారు మావారు. వచ్చేస్తావుగా అన్నమాటలోనే ‘వచ్చేద్దూ’ అనే చిన్న అభ్యర్థన. అది నాకర్థమయింది. నవ్వొచ్చింది.**


# స్నేహార్తి

– వలివేటి నాగచంద్రావతి

రెండో ఇన్నింగ్స్‌లో ఉన్నాం మేం. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో రాజ్యమేలేది మోజు, మోహం అయితే... పిల్లలు పెద్దవాళ్ళయి, ఎవరి గూడు వాళ్ళు ఏర్పాటుచేసుకుని ఎగిరి వెళ్ళిపోయాక మొదలయ్యే సెకండ్ ఇన్నింగ్స్‌లో భార్యాభర్తల మధ్య అల్లుకునేది అనుబంధం, అటాచ్‌మెంట్.

ఆఫీసునుంచి రాగానే నేనింట్లో కనబడకపోతే ఆయనగారి మొహం ఎంత డల్ అయిపోతుందో నాకు బాగా తెలుసు. కానీ నేనిప్పుడు ఏమాత్రం మెత్తపడదలుచుకోలేదు.

వెళ్ళేది ఎక్కడికి? రాధిక దగ్గరికి!



“ఏమో చెప్పలేను. అది రానిస్తుందని నమ్మకంలేదు నాకు. చూస్తాను” అన్నాను బింకం సడలనివ్వకుండా.

“సరె, సరె... జాగ్రత్త. అడ్రసూ అదీ సరిగ్గా ఉందిగా, కనుక్కోగలవుగా” అన్నారు సమాధానపడిపోతూ.

“ఆహా” అంటూండగానే బస్ కదిలింది.

కిటికీ పక్కసీటు. గాలి చల్లగా మొహానికి తగులుతోంది. నేను దిగాల్సింది లాస్ట్ స్టేజ్‌లో. తేలిగ్గా గంటపడుతుంది. తీరిగ్గా వెనక్కానుకుని కూర్చుని ఆలోచనల్లోకి ఎగిరిపోయాను. కాస్సేపటిలో రాధికని కలుసుకోబోతున్నానన్న ఆనందం మనసును ఉత్సాహభరితం చేస్తోంది.

రాధిక నా తొలి స్నేహితురాలు.

నా చిన్నప్పుడు ఊరికి దూరంగా కొత్తగా కడుతున్న కాలనీలో ఉండేవాళ్ళం. మాకు రెండిళ్ళవతల రాధిక ఇల్లు. కాలనీకింకా మున్సిపల్ వాటర్ సప్లై లేదు. మా బావిలో నీళ్ళు తియ్యగా ఉండేవి. రాధిక•వాళ్ళమ్మ మా ఇంటికి మంచినీళ్ళకోసం వచ్చేది. వెంటే రాధిక. నూతి పళ్ళెంలో బిందెపెట్టి ఆవిడ మా అమ్మతో కబుర్లలోపడితే మేమిద్దరం ఆటల్లోపడేవాళ్ళం. అలా మూడేళ్ళ వయసులోనే మొదలయింది మా స్నేహం.

కాలనీలో విసిరేసినట్టుగా అక్కడొకటీ ఇక్కడొకటీ పూర్తయి కాపురాలుంటున్న ఇళ్ళలో మా ఈడు ఆడపిల్లలు లేరు. మామధ్య స్నేహం గబగబా పెరిగిపోయి మర్రి ఊడల్లా పెనవేసుకుపోవటానికి అదికూడా ఒక కారణం కావచ్చు.

కడ్తూకడ్తూ సగం తయారైన ఇళ్ళన్నీ మాకు బొమ్మరిళ్ళే. ఇటుకలూ ఇసుకా, ఆ ఇసుకలో దొరికే ఆల్చిప్పలూ శంఖాలూ మాకు ఆటవస్తువులు. అక్కడ పెరిగిన పిచ్చి మొక్కల ఆకులూ పూలూ మా బొమ్మలకు అలంకారాలు.

రాధిక వాళ్ళ అమ్మో, మా అమ్మో మమ్మల్ని వెతుక్కుంటూ వస్తేతప్ప మా ఆటలకి అంతూ దరీ ఉండేదికాదు.

ఆ ఏడాదే కాన్వెంట్‌లో జాయిన్ చేశారిద్దరినీ. ఒకే స్కూలు, ఒకే క్లాసు కానీ సెక్షన్లు మాత్రం వేరయ్యాయి.

నేను కొద్దిగా విచారపడ్డాను. ‘అయ్యో, రాధికతో కలిసుండటానికి వీల్లేకపోతుందే స్కూల్లో’ అని. అంతే. రాధిక అలాక్కాదు. ఏడ్చి గోలపెట్టి వాళ్ళ నాన్న దగ్గర స్కూలుకి వెళ్ళనని మారాంచేసి ఆయనతో ఆ స్కూలు ప్రిన్సిపాల్‌కి రిక్వెస్టు చేయించి మొత్తానికి నా సెక్షనుకి మార్చేదాకా వదిలిపెట్టలేదు.

అప్పుడర్థమయింది - రాధికకి నేనంటే ఎంతిష్టమో. ఆ తరవాత కూడా అప్పుడప్పుడూ రాధిక చేష్టలు నామీద తనకున్న అభిమానాన్ని చెబుతూనే ఉండేవి.

ఒకసారి - ఏదో పండగ - బహుశా శ్రావణ శుక్రవారం అయ్యుండాలి. రాధిక చక్కగా అలంకరించుకుని వచ్చింది మా ఇంటికి. పట్టు లంగా, వెల్‌వెట్ జాకెట్, నడుముకి వడ్డాణం, మెళ్ళో హారం... బుట్టబొమ్మలా ముద్దొచ్చేలా తయారుచేసింది వాళ్ళమ్మ.

ఆర్థిక అసమానతల సంగతింకా గ్రాహ్యానికి రాని వయసు మాది. రెండు మీటర్ల పూల బట్టతో గౌను కుట్టించింది మా అమ్మ నాకు. రాధికని చూసిన నా కళ్ళు మెరిస్తే, నన్ను చూసిన రాధిక మొహం వెలవెలబోయింది.

‘ఇప్పుడే వస్తానుండు’ అని వెనక్కి వెళ్ళిపోయింది రాధిక. అరగంటలో తిరిగొచ్చింది - సాదా గౌను, సన్నటి గొలుసుతో.

నిజంగా ఆ క్షణంలో రాధికంటే నాక్కలిగిన భావానికి భాషా రూపమివ్వటం నావల్లకాలేదుగానీ, రాధిక భుజం చుట్టూరా చేయివేసి ‘మనిద్దరం ఎప్పుడూ ఒక జట్టుగానే ఉండాలి, సరేనా’ అని అనటం మాత్రం బాగా గుర్తు.

మా ఇద్దరిమధ్యా సాన్నిహిత్యం పెరిగేకొద్దీ రాధికకి నేనంటే ఆరాధన అంతగానూ పెరిగిపోయింది. ఎంతగా అంటే- నేను చేసిన తప్పులు కూడా తన నెత్తినవేసుకునేటంత. స్కూల్లో ప్రయోగమేదో చేస్తూ బీకరొకటి నేను పగలకొడితే అది తనే చేశానని చెప్పి, టీచరుచేత చేతిమీద కట్లుదేలేలా దెబ్బలు తింది. ‘ఎందుకే అట్లా’ అంటే, ‘నిన్ను కొడుతూంటే నేను చూడలేను’ అంది.

అట్లాంటి ప్రాణంపెట్టే స్నేహితురాలు ఎవరికిమాత్రం అపురూపమనిపించదు. రాధిక నాకు ప్రియాతిప్రియమైపోయింది.

మాకు పద్నాలుగేళ్ళు వచ్చేదాకా మా స్నేహం అలాగే సాగింది. ఎంత మధురమైన రోజులవి. వచ్చిన ప్రతి ఊహనీ కలబోసుకోవటం, కలిగిన ప్రతి ఆలోచననీ పంచుకోవటం, భవిష్యత్తుని వర్తమానంలో దర్శించి పరవశించిపోవటం... ఏవేవో ఊసులు... నవ్వులు. ఓహ్, తలుచుకుంటే ఇప్పటికీ మనసు పులకరించిపోతుంది.

ఈమధ్యలో సరోజిని, సత్యవతి, వరలక్ష్మి,

ఆషా లాంటి ఎందరో అమ్మాయిలు నదిలో కలిసే వాగులో వంకల్లా మా స్నేహంలో కలిశారు. ఒక్కరొక్కరు ఒక్కో పరిస్థితిలో పంటకాలువల్లా మా నుంచి విడిపోయి వెళ్ళిపోయారు.

మా ఇద్దరి స్నేహం మాత్రం చెదరకుండా జీవనదిలా ఎప్పటికీ సాగిపోతుందనుకున్నాం.

కానీ-

రాధికా వాళ్ళ నాన్నగారు కొత్త బిజినెస్ స్టార్టు చేసుకుని ఫ్యామిలీతోసహా దూరంగా వెళ్ళిపోయారు.

చాలా దుఃఖపడ్డాం మేం. ఇప్పటిలా ఇంటింటా టెలిఫోన్ సౌకర్యం వ్యాప్తిచెందని కాలం. సెల్‌ఫోన్లు ఊహకు కూడా అందవేమో. అంచేత ఉత్తరాలు మాత్రం తరచూ రాసుకుంటూ ఉండాలనీ, ఎప్పుడూ ఈ స్నేహాన్ని మరచిపోకూడదనీ ఒకరికొకరం చెప్పుకుని విడిపోయాం.

ఎంతో ఎమోషనల్‌గా రెండుమూడుత్తరాలు వెంటవెంటనే రాసుకున్నాం కూడా.
ఆ తరవాత ఆ ఉద్రేకం పలచబడింది.
ఆ తరవాత ఆగిపోయింది.

ఏడాది తరవాత రాధిక పెళ్ళి శుభలేఖ వచ్చింది మాకు. వెళ్ళాలని చాలా ఉబలాట పడ్డాను. 'అబ్బో, చాలా దూరం. దారిఖర్చులే బోలెడు అవుతాయి' అన్నారు నాన్న. పెద్దలచాటు ఆడపిల్లని. ఏం చెయ్యగలను. అంతే. ఆ తరవాత రాధిక సమాచారమే నాకందలేదు. నేను రాసిన రెండు ఉత్తరాలు తిరిగి నాకే వచ్చేశాయెందుకో. అలా రాధిక నాకు పూర్తిగా దూరమైంది.

కానీ కంటికి కనబడనంతమాత్రాన, కబురుకు అందనంతమాత్రాన నా మనసులో గాఢంగా ముద్రించుకుపోయిన ఆ స్నేహం తాలూకు గుర్తులేలా మాసిపోతాయి.

రోజులూ నెలలూ సంవత్సరాలూ గడిచినా గృహిణిగా, అమ్మగా, అమ్మమ్మగా ఎన్ని దశలు దాటినా రాధిక నా జ్ఞాపకాలలో పదిలంగా ఉండిపోయింది. అప్పుడప్పుడూ కల్లోకి కూడా వచ్చి పలకరించేది. 'ఎక్కడుందో... ఎలా ఉందో?' అనుకునేదాన్నప్పుడు.

ఇదిగో ఇన్నాళ్ళకి... కాదుకాదు... ఇన్నేళ్ళకి రాధిక జాడ తెలిసింది.

మొన్నామధ్య ఓ పెళ్ళి ఫంక్షన్లో ఒకావిడ పరిచయమైంది. పుట్టిళ్ళూ చదువులూ... ఇలాంటి మాటలు దొర్లుతున్న సందర్భంలో అనుకోకుండా ఆవిడ రాధిక పినతల్లి కూతురని తెలిసింది. 'అరె, మీకు తెలీదా... రాధికావాళ్ళు ఈ ఊళ్ళోనే ఉన్నారు' అన్నదావిడ.

నిజంగా చెబుతున్నాను- ఆ తరవాత పెళ్ళేలా జరుగుతోందో నాకు తెలియలేదు. అడ్రసడిగి తీసుకున్నాను. ఇదిగో ఇలా బయలుదేరాను.

"మేడమ్, ఇదే లాస్ట్ స్టాపు. చెప్పమన్నారుగా?" కండక్టరు హెచ్చరికతో ఈ లోకంలోకొచ్చాను.

★ ★ ★

సంపన్నులుండే లొకాలిటీ అది. అక్కడే ఉంది 'బృందావనం' - పోష్‌గా ఉండే అపార్ట్‌మెంట్ల సముదాయం.

ఎప్పుడో కంఠోపాఠమైపోయింది కానీ ఎందుకైనా మంచిదని అడ్రస్ స్లిప్ తీసి చూశాను. నాలుగో అంతస్తు. రెండువందల పన్నెండో నంబరు ఫ్లాటు. లిఫ్ట్‌లో ఫోర్తు ఫ్లోరుకి చేరుకున్నాను. రెండే ఫ్లాట్లు ఉన్నాయక్కడ. కుడివైపున రెండువందల పదకొండు, ఎడమవైపున... అటుగా అడుగులు పడేకొద్దీ ఏదో తెలీని ఉద్వేగం అలుముకుంటోంది లోపల.

కాలింగ్‌బెల్ నొక్కాను. నన్ను చూడగానే ఏమవుతుంది రాధిక... మాటలురాని సంభ్రమంలో ఉక్కిరిబిక్కిరవుతుందా... గట్టిగా కౌగిలించేసుకుంటుందా... ఊపిరాడకుండా ప్రశ్నలవర్షం కురిపిస్తుందా... లేకపోతే గట్టిగా ఏడ్చేస్తుందా!



"ఎవరు కావాలండీ?" సర్వెంటనుకుంటా - తలుపు తీశాడు.

"రాధిక..."

"అమ్మగారా? ఉన్నారు. పిలుస్తాను. లోపలికి రండి" అడ్డుతొలుగుతూ అన్నాడు.

లోపలికి అడుగేశాను. ఓపెన్ వరండా చాలా విశాలంగా ఉంది. రకరకాల పూల మొక్కలు, క్రోటన్స్... కుండీల్లో ఆర్చీలుగా అందంగా అమర్చారు. చిన్నప్పట్నుంచీ రాధికకి పూలన్నా పూలమొక్కలన్నా మహా పిచ్చి. ఆ సరదా ఇప్పటికీ అలానే ఉన్నదన్నమాట.

లోపల్నుంచి మాటలూ నవ్వులూ వినిపిస్తున్నాయి. రాధిక భర్త ఓ పెద్ద ఆఫీసరు. ఆయనకోసం వచ్చేవాళ్ళకోసమనుకుంటా - నాలుగు కుర్చీలు వేసున్నాయక్కడ. ఒకదాన్లో కూర్చోబోతున్నాను.

"ఎవరూ?"

గబుక్కున తిరిగానటుకేసి. మెయిన్‌డోరు ముందర పక్కనే మరొకామెతో సహా నుంచునుంది రాధిక.

అవును. తను రాధికే. అణగకుండా గుబురుగా పొట్టిగా ఉండే ఆ నొక్కులజుట్టు... ఆ పెద్ద కళ్ళు... ముఖ్యంగా పెదవి పక్కన పెసరబద్దంత పుట్టుమచ్చ... వయసు మళ్ళిందే కానీ ఆ పోలికలెక్కడికి పోతాయి. నా రాధికని ఎక్కడున్నా పోల్చుకోగలను నేను.

"నేను... ఇందు... ఇందిరని" చిరునవ్వుతో చెప్పాను.

ప్చ్... నాలా చూడగానే గుర్తుపడుతుందనుకున్నాను. ఉహూ... పోనిద్దూ...
ముప్ఫైరెండేళ్ళ గాప్. వయస్సూ కాలమూ శరీరాకృతిలో ఎన్నో మార్పులు తెచ్చుంటయ్. తక్షణం తెలుసుకోలేకపోవటం పెద్ద తప్పేంకాదులే. క్షమించెయ్యొచ్చు.

"ఇందిరా? ఏ ఇందిర. అదేదో వెల్‌నోటెడైనట్టు పేరొకటీ చెబితే ఎలాగ?" కంఠంలో విసుగు.

జంకాన్నేను. నాకు తెలిసిన రాధిక ఇంత కటువు కాదే!

"మీరూ మేమూ ఏలూరు అశోక్‌నగర్ కాలనీలో ఉండేవాళ్ళం మన చిన్నప్పుడు... దాదాపు ముప్ఫై ఏళ్ళకు పైబడిందనుకో... ఒకే వీధిలో ఉండేవాళ్ళం. ఒకే స్కూల్లో చదువుకున్నాం. మరచిపోయావా రాధీ. ఎంత స్నేహంగా ఉండేవాళ్ళమో అప్పుడు. ఎలా ఆడేవాళ్ళమో..."

అలా చెప్పుకోవాల్సి రావటం చిన్నతనంగా అనిపిస్తున్నా ఓ చిన్ని ఆశ - 'చటుక్కున గుర్తుకొచ్చేసి, చప్పున దగ్గరకొచ్చెయ్యకపోతుందా' అని.

"అబ్బో, ముప్ఫై ఏళ్ళ కిందటి మాటా? కావచ్చులెండి. నాకు జ్ఞాపకశక్తి కొంచెం తక్కువ. సరే, అయితే ఏమిటి?" అదీ రాధిక రియాక్షను.

అంత వివరంగా చెప్పినా కూడా గుర్తుకు రాలేదా? వచ్చినా నిర్లక్ష్యమా? అదేమిటలా అడుగుతుంది? ఏం చెప్పను సమాధానం. నాలో ఉత్సాహం నీరుకారిపోతోంది. కనీసం లోపలికి రమ్మనయినా పిలవదేం?

"రాధికగారితో ఏమన్నా పనుందా? ఫరవాలేదు చెప్పండి". నేను మాట్లాడకపోవటం, తటపటాయించటం చూసి, గుమ్మంలో ఉన్నావిడ అడిగింది కొంచెం సౌమ్యంగా.

'పనా... ఏం పని? తనతో పనుండి వచ్చానా నేను? అసలెందుకు వచ్చాను' అప్రయత్నంగా నా తల అడ్డంగా ఊగివుంటుంది.

"ఆవిడతో కాకపోతే మరి జనార్ధన్‌గారితో పనుండి వచ్చారా? మీది వ్యాపారమా? ఏదన్నా ప్రాబ్లమా?" టకటక ప్రశ్నలు వేస్తోందావిడ.

రాధిక భర్త సేల్స్‌టాక్స్ ఆఫీసరు. నా రాకకి ఏమర్థం తీసుకుంటున్నారో అర్థమవుతోంది. తెల్లబోయాను నేను. ఎంత అపోహ!

నేను నోరెత్తేలోపలే రాధిక తనకంతా అర్థమైపోయినట్టు, "ఓ... ఆయనకోసమా?" అంటోంది అదోలా మొహంపెట్టి. "తను ఇంట్లోలేరు. ఒకవేళ ఉన్నా ఆఫీసు వర్క్

విషయాల్లో నేనస్సలు కలగజేసుకోను. ఎంత స్నేహితులైనా సరే. సారీ" అంది - మీరిక వెళ్ళొచ్చు అన్నట్టు సీరియస్‌గా.

నాకు మతిపోతోంది. "రాధీ, నా మాటలు పూర్తిగా విని మాట్లాడు. నేను నీకోసమే..."

విరుచుకుపడింది రాధిక. "ఏమిటండీ ఇందాకట్నించీ చూస్తున్నాను. అండీ అండీ అంటూ ఎంత రెస్పెక్ట్ ఇస్తున్నాను. నువ్వు నువ్వు అంటారేమిటి? మేనర్స్ లేనివాళ్ళంటే నాకసహ్యం" అంటూ.

నా నాలుకమీద తడారిపోయింది. ఇంకా అక్కడ నిలబడాలని కానీ... నిలబేడి మాది వ్యాపారంకాదనీ తనని చూసి మాట్లాడాలనే కోరికతో కలవరించిపోతూ వచ్చాననీ చెప్పి ఒప్పించాలనికానీ నాకనిపించలేదు. మళ్ళీ మాట్లాడితే మరుక్షణం తన ముందరనుంచి మాయమైపోతే బాగుండుననిపించింది.

గిరుక్కున వెనక్కి తిరిగాను. వెనకనుంచి మెల్లగా మాటలు వినబడుతున్నాయి. "చిన్నప్పటి ఫ్రెండ్‌నంటోందిగా... నిజంగానే మిమ్మల్ని చూడ్డానికొచ్చిందేమో!"

"చాల్లే. ఎప్పుడో ముప్ఫయ్యేళ్ళక్రితం ఫ్రెండ్‌షిప్ కారణంతో నన్ను చూడటానికి వెతుక్కుంటూ ఇంతదూరం వచ్చిందంటున్నావా? సిల్లీ. అంత పిచ్చివాళ్ళున్నారంటే నమ్మన్నేను. ఇంకేదో మోటివ్ ఉండే ఉంటుంది" - రాధిక మాటలవి.

చెవులు రెండూ పనిచెయ్యకపోతే బాగుండు ననుకుంటూ గబగబ లిఫ్ట్‌కేసి నడిచాను. మన సంతా మొద్దుబారినట్టుంది. ఎలా బస్టాండుకి వచ్చానో ఎలా ఇంటికి చేరానో నాకే తెలీదు.

తాళంతీసి మంచంమీదపడ్డాను. ఒంట్లో చైతన్యాన్నెవరో బ్లాటింగ్ పేపరుతో ఒత్తేసినట్టు ఏదో నీరసం. వెళ్ళేటప్పుడు ఇంట్లో ఎక్కడ పని అక్కడే వదిలేశాను. కానీ ఇప్పుడేమీ చెయ్యాలనిపించటంలేదు. నామీద నాకే జాలి. ఎప్పుడూలేంది బావురుమని ఏడవాలనే కోరిక. కనీసం ఆకలి కూడా వెయ్యట్లేదు. సాయంత్రం ఆయన వచ్చేదాకా అలానే నిస్సత్తువగా మంచంమీద పడుకుండిపోయాను.

★ ★ ★

తలుపు తీశాను. నన్ను చూడగానే మావారి మొహంలో ఆశ్చర్యం, ఆనందం కలగలిసి తాండవమాడాయి.

"అరె, వచ్చేశావా? అస్సలు ఊహించలేదు సుమా. మంచి పన్జేశావు. నిజంగా మంచిపని చేశావు" అన్నారు సంతోషంగా.

ఒక తిరస్కారం చవిచూసినవేళ ఆ వెనకే లభించిన పురస్కారంలా ఆయన్నించి ఆ రకమైన ఎదురుకోలు - నాకు ఓదార్పుగా సగం వేదన తీరినట్టుగా అనిపించింది.

"ఏమిటోయ్, స్నేహితురాళ్ళిద్దరూ పొద్దుట్నించీ కబుర్లతోనే కడుపు నింపేసుకున్నారా ఏం? ఏమీ తిననట్టు మొహమలా వడిలిపోయిందీ" అంటూ ప్రేమగా పరామర్శిస్తూనే, "ఇందూ నీకింకో సర్‌ప్రైజ్... నీకోసం ఇంకొకర్ని తీసుకొచ్చాను చూడు" అన్నారు నవ్వుతూ.

ఆయన మాటలింకా పూర్తవలేదు. వాకిట్లో ఆటో ఆగింది. సల్వార్ కమీజ్‌లో ఉన్న ఒకావిడ దిగింది.

"ఒక స్నేహితురాలిని నువ్వెతుక్కుంటూ వెళ్ళావా, నిన్ను వెతుక్కుంటూ ఇంకో స్నేహితురాలిటు వచ్చారు". ఆటోవాడికి డబ్బులి స్తున్న ఆవిణ్ణి కంటితో చూపిస్తూ, "షీలా, కాకినాడలో మీ అమ్మమ్మగారి ఇంటి ఎదురుగా... నీ కన్నడం స్నేహితురాలు షీలా. చూడు, చూడు... జ్ఞాపకం రావట్లా?" తొందర తొందరగా అడిగారు.

స్నేహితురాలా? షీలానా? అయోమయంగా నేనూ అటు చూశాను.

నా వయసే. చెంపలు నెరిశాయి ఆవిడకీను. కాకపోతే ఆ డ్రస్‌లో కాస్త చిన్నగా కనబడు తోందంతే. అదలా ఉంచితే, తానెవరో ఏమిటో ప్చ్... ఏ ఆనవాలూ దొరకట్లేదే.

"ఇంతకుముందు షీలాగారు మా బ్యాంక్‌కి రెగ్యులర్‌గా వచ్చే కస్టమర్‌గా ముఖపరిచయం. ఈరోజు అనుకోకుండా నా పర్సులో మన ఫొటో చూశారు. నిన్ను గుర్తుపట్టారు. 'ఇందిర కదూ, నా ఫ్రెండే తను' అంటూ ఏదో నిధి కనిపెట్టినట్టు తెగ సంబరపడిపోయారు. అరగంటసేపు నీ గురించే స్తోత్రమనుకో. ఇప్పటికిప్పుడు నిన్ను చూస్తేగానీ రాత్రికి నిద్రపట్టదంటారు. ఏం చేయను? నువ్వు వచ్చుంటావో లేదో అని అనుమానం. అదృష్టం. నువ్వున్నావు. పాపం ఆవిడ కోరిక తీరింది". ఆవిడతోటి పరిచయాన్ని ఆయనలా చెబుతూనే ఉన్నారు. ఈలోగా ఆమె నాకు దగ్గరగా వచ్చేసింది.

"ఇందూ బావున్నావా? ఎంతకాలమైంది నిన్నుచూసి. ఏమిటలా చూస్తావ్? గుర్తులేనా నేను" అన్నది ఆత్మీయంగా నా చేయి తన చేతిలోకి తీసుకుని.

ఏమని చెప్పాలి. ఇంత దగ్గరగా చూసినా, ఏ స్నేహితురాలి పోలికా పొడగట్టడంలేదే..?

ఓపక్క పరిచయమేలేదనిపిస్తోంటే ఆవిడ నా చేతులు పట్టుకోవటం, భుజంమీద చెయ్యే యటం... నాకేమిటో కాస్త ఎబ్బెట్టుగా ఇంకాస్త ఇబ్బందిగా అనిపిస్తోంది.

మొహమాటంగా చేయి విడిపించుకున్నాను. 'సారీ అండీ, నిజంగా జ్ఞాపకం రావట్లేదు' అని మర్యాదగా చెప్పాలని నా ఆలోచన. నాలిక చివరిదాకా ఆ మాట వచ్చేసింది కూడాను.

"భలేవారే. మిమ్మల్ని మరచిపోవటమేమి టసలు. మీ గురించీ మీరిచ్చిన తీగ గులాబీమొక్క గురించీ మీ అమ్మగారు చేసిపెట్టిన 'బిసిబెళాబాత్' గురించీ సందర్భ మొచ్చినప్పుడల్లా చెబుతూనే ఉంటుంది. ఎవర్ని మరచిపోయినా ఫ్రెండ్స్‌ని మాత్రం మరచిపోదండోయ్ మా ఇందూ".

హతోస్మి, ఇంకేం మాట్లాడను! నా వాలకం



చూసి ఆవిడెవరో నాకు తెలీటంలేదని అర్థమైపోయినట్టుంది - వెనకనుంచి సైగలు చేస్తోండటమే కాకుండా, ఆవిడ తనకు చెప్పిన కబుర్లలోనుంచి కొన్ని తీసి నాకు హింటివ్వటానికి ప్రయత్నిస్తున్నట్టున్నారాయన.

నాకొంచెం చిరాకనిపించింది. అసలే ఆశాభంగంతో అవమానభారంతో ప్రాణం అలిసిపోయినట్టుంటే ఎవర్నో తీసుకొచ్చి ఈ నస ఏమిటని?

గమ్మత్తేమిటంటే అన్ని హింట్లిస్తున్నా నా బుర్రలో వెలగని బల్బు 'నిజంగా?' అంటున్న ఆమె మొహంలో వెలిగింది. మామూలు బల్బుకాదు... వెయ్యి ఓల్టుల వెలుగు. నన్ను చూడగానే రాధిక మొహంలో వస్తుందని నేనాశపడ్డ వెలుగు.

ఆ వెలుగులో నాకు జ్ఞానోదయమయింది. నేను చేయబోయిన తప్పిదం నాకు తెలిసివ చ్చింది. రాధిక ఉదాసీనత నన్నెంత క్షోభపెట్టిందో, మీరెవరో నాకు తెలీదని ఆమె మొహమ్మీద విరిచినట్టు చెబితే, నా నిర్మొహమాటం తననీ అంత బాధపెట్టదా? ఏమైంది నా వివేకం.

నా తొందరపాటుని కప్పుకువచ్చిన ఆయన్ని కృతజ్ఞతగా చూశాను. నేనింక ఆలోచించలేదు. రాధిక చేసిన గాయం తాలూకు నొప్పి ఇంకా బాధిస్తూనే ఉండగా అదే తప్పు నేనెలా చేయను?

తానెప్పటి స్నేహితురాలో ప్రస్తుతం జ్ఞాప కంలో ఉండకపోవచ్చు. కాసేపు గతకాలాన్ని తిరగేసి అమ్మమ్మగారి ఊరు, సెలవుల్లో ఆ ఊళ్ళో గడిపిన రోజులు, ఆ ఊరివాళ్ళ పరిచయాలు... ఆ జ్ఞాపకాల తలుపులు తెరిచి వెతికితే ఎక్కడో ఓచోట షీలా దొరక్కపోదు. ఈలోగా రాధికలా తొందరపడి, నాకోసం స్నేహహస్తం చాచి వచ్చిన ఈమెనెందుకు బాధపెట్టాలి... ఈమెను ఆదరించటంలో ఆహ్లాదపరచటంలో తీరని నా స్నేహార్తిని తీర్చుకోవాలిగాని! అంతే, ఆలోచనలకు ఫుల్ స్టాప్ పెట్టి, హృదయపూర్వకంగా "షీలా" అంటూ రెండుచేతులా స్వాగతించాను. ★